


3

చిలుకూరి దేవపుత్ర

# మనిషితనం

పొద్దు సోమవారం.

ప్రతి సోమవారం సాయంత్రం 4-30 గంటలకి జాయింట్ కలెక్టర్ గారి కోర్టులో శ్రోత్రియం భూములకు సంబంధించిన కేసులు జరుగుతాయి. నేను పనిచేస్తున్న సీటు, శ్రోత్రియం భూములకు సంబంధించినదే. అందువల్ల ఆ రోజు సాయంత్రానికి వాయిదాపడ్డ కేసుల్ని,ఫైళ్ళనీ సిద్ధం చేసుకుంటున్నాను.

మధ్యాహ్నం ఒంటిగంట అయింది. ఆఫీసులోని ఉద్యోగులందరూ భోజనాలు చేసిరావడానికి ఇళ్ళకు పోతూఉన్నారు.

నేనూ ఈపాటికి వెళ్ళిపోయేవాడిని. ఒక ముఖ్యమైన ఫైలు కనబడకపోవడంతో బీరువానంతా గాలించేస్తున్నా. అది ఎంతకీ కనబడకపోయేసరికి, ఆందోళన ఎక్కువవుతూవుంది. దాన్ని చివరిసారిగా ఎప్పుడు చూశానో గుర్తు చేసుకున్నాను. గుర్తుకురావడం లేదు. నా ఆలోచనలు పరిపరి విధాల పోతున్నాయి. ఒక్కో ప్యాడ్‌లోని ఫైలునే నెమ్మదిగా వెతకసాగాను. నా శ్రమ వృథాకాలేదు. ఒక ప్యాడ్‌లో ఉన్న రెండోఫైలు అదే! హమ్మయ్య దొరికింది అన్న సంతోషంతో బీరువాలోకి ఫైళ్ళన్నింటినీ పెట్టేస్తుంటే-

"రాజా!" అన్న పిలుపు వినిపిస్తే, తలతిప్పి చూశాను.

వాకిలివద్ద నిలుచున్న వ్యక్తి నవ్వుతూ ఉన్నాడు. వెంటనే గుర్తుపట్టాను-బాషా!

"అరెరె.. బాషా! రారా!" అన్నాను.

బాషా వాకిటికి అవతల గోడపక్కగా చూస్తూ ఎవర్నో రమ్మన్నట్టు సైగ చేశాడు. ఆ వ్యక్తి రాగానే ఇద్దరూ నా టేబుల్ దగ్గరికి వచ్చేశారు.

బాషాని కుశల ప్రశ్నలడిగాను. తనతోబాటూ వచ్చిన మనిషిని పరిచయం చేశాడు. "ఈయన మా అన్నయ్య. పేరు ఫకృద్దీన్‌సాబ్. బైపాస్ రోడ్లో టైలరింగ్ షాపు పెట్టుకున్నాడు" అని సంతోషంగా అతనితో కరచాలనం చేశాను.

వాళ్ళు ఎందుకొచ్చిందీ వివరాలు తెలుసుకున్నాను.

ఫకృద్దీన్ దాదాపు ముప్పయి ఏళ్ళ కిందట నగరానికి ఆనుకొని వున్న పాపంపేట పొలంలో పదిసెంట్ల ఇంటి ప్లాటును కొన్నాడు. ఆ కొన్నది శ్రోత్రియం భూమి కాబట్టి, రైతువారీ పట్టా తప్పనిసరి. అందువల్ల మంజూరు కోసం నా దగ్గరకు వచ్చారు. తప్పకుండా మీకు రైతువారీ పట్టా మంజూరు

అవుతుంది–మీ దగ్గరున్న పత్రాలన్నీ తీసుకు రండి" అని చెప్పాను.

అది కాఫీ తాగే వేళ కాకున్నా పాత మిత్రుడు వచ్చాడు కదా అని – "పదండి క్యాంటీన్‌లో కాఫీ తాగుదాం!" అన్నాను. సరిగ్గా భోజనాల వేళప్పుడు ఇట్లా మిత్రులు రావడం, వాళ్ళకోసం కాఫీ తాగడం అప్పుడప్పుడూ జరుగుతూ ఉంటుంది.

బాషా కాఫీ వద్దంటూనే, అది రమ్‌జాన్ మాసమయినందువల్ల తనూ, వాళ్ళన్నయ్యా ఉపవాసాలు చేస్తున్నట్లు చెప్పాడు.

అతనట్లా మాట్లాడుతూ ఉంటే, పరిశీలనగా మొహాన్ని చూశాను. అతని నుదుటిమీద రూపాయి కాసంత నల్లని మచ్చ ఏర్పడింది. వాళ్ళన్నయ్యకీ అదే మాదిరిగా వుంది. అయిదుపూటలా నమాజు చేసేవారికే అట్లాంటి మచ్చలు ఏర్పడతాయని విన్నాను. వాళ్ళు వెళ్లిపోయారు. నేను స్కూటర్లో ఇంటిదారి పట్టాను.

నాకెందుకో బాషా అంత సనాతనపరుడుగా అయిపోయాడంటే ఆశ్చర్యంగా వుంది. అతను నాకు చిన్ననాటినుంచీ క్లాసుమేటు. 12వ తరగతి తర్వాత అతను చదువు మానేశాడు. నేను డిగ్రీ చదివేందుకు తిరుపతికి వెళ్ళిపోయాను. 20 ఏళ్ళ కిందట ఓసారి బస్సులో నేను కళ్యాణదుర్గం నుంచి వస్తుంటే కలిశాడు. తనకు ఫారెస్టు డిపార్టుమెంటులో ఉద్యోగం వచ్చిందనీ, కళ్యాణదుర్గంలోనే కాపురముంటున్నట్లు చెప్పాడు.

"ఏమిటి నీకు పెళ్ళికూడా అయిందా?" అనడిగాను. తను ఒక క్రిస్టియన్ అమ్మాయిని లవ్ మ్యారేజి చేసుకున్నట్టూ, తనూ అమ్మాయికోసం ఆ మతాన్నే పుచ్చుకున్నట్లు చెబుతూ, ప్రతి ఆదివారం ఆలుమగలిద్దరూ క్రమం తప్పకుండా చర్చికి పోతున్నట్లుగా కూడా చెప్పాడు.

"మీ ఇంట్లో నిన్ను ఇబ్బందిపెట్టలేదా?" అనడిగాను.


"ఎందుకు పెట్టలేదూ. ఆ అమ్మాయిని వదిలేసెయ్యి, మన మతం పాపతో పెళ్ళి చేస్తానంటూ ఏడ్చి మొత్తుకుంది మాయమ్మ. నేను ఒప్పుకోలేదు. ఇప్పటికీ హాయిగా ఉన్నాను. ఒక పాపకూడా పుట్టింది రాజా!" అన్నాడు బాషా.

మరి ఇప్పుడిట్లా మారిపోయాడంటే, ఏదో జరిగేవుంటుంది.

×××

మరుసటిరోజు పదకొండుగంటలకల్లా ఆఫీసుకు వచ్చాడు బాషా, వాళ్ళన్నయ్య భూమికి సంబంధించిన అన్ని రిజిష్టరు పత్రాలతో "మా అన్నయ్య నీరసంగా ఉన్నందువల్ల రాలేకపోయినాడు రాజా!" అన్నాడు.

"నాకు రిజిష్టరు పత్రాలతోనే పని" అన్నాను నవ్వుతూ. నా టేబులు ముందున్న కుర్చీ చూపించాను.



కూచున్నాడు.

రిజిష్టరు పత్రాలు చూడ్డం అయిపోతూనే ఫైలులో పెట్టేసి– "అన్నీ సరిగా ఉన్నాయి బాషా! రెండునెలలపైనే పట్టవచ్చు మీ అన్నయ్యకి రైతువారీ పట్టా రావడానికి" అని చెప్పాను.

అతను వెళ్ళిపోవడానికి కుర్చీలోంచి లేచాడు. అతనితోపాటు ఆఫీసు బయటికి నడిచాను.

"అది కాదు బాషా! నువ్వు క్రిస్టియన్‌లోకి మారానని 20 ఏళ్లకిందట చెప్పినావు. నాకు బాగా గుర్తుంది. మళ్లీ బ్యాక్‌టూ పెవిలియనా' అన్నాను. అందాకా నాలో ఎప్పుడెప్పుడు అడుగుదామా అనుకున్న సందేహమిది.

చిత్రంగా నవ్వాడు బాషా.

"అమ్మకూ, అన్నయ్యకీ నేనంటే పిచ్చిప్రేమ. అప్పట్లో నేనే ఎప్పుడు ఈ ఊరికి వచ్చినా ఒకటే ఏడుపులు. నాక్కూడా ఎక్కడో నా మతమంటే మమకారం ఉండేదేమో, తిరిగి మా మతంలోకి మారిపోయినాను రాజా! అమ్మా, అన్నయ్యలిద్దరూ ఎంత సంతోషపడినారో. ఇప్పుడంతా వాళ్ళ ఇష్టం ప్రకారమే నేను నడుచుకుంటూ ఉన్నాను. చానా సనాతనునిమాదిరి కనిపిస్తా ఉన్నాను కదా! ఇప్పుడు ఈ ఊరికే బదిలీ అయింది కాబట్టి అన్నయ్య పక్కింట్లోనే ఉంటున్నాను" అన్నాడతను. 'మంచిపని చేశావులే సనాతన ముసల్మానువి కూడా అయినావు' అనుకుంటూనే ఆలోచనలో పడ్డాను.

మగవాడు సరే ఆడవారి పరిస్థితి ఏమిటీ– ఆ అమ్మాయి బాషాని నమ్మి పెళ్లిచేసుకుంది మరి! కొంపతీసి ఈ దుర్మార్గుడు వాళ్ళమ్మ, అన్నయ్యలకోసం మతపరమైన పెళ్లిచేసుకున్నాడా? అందులోనూ వాళ్ళ మతంలో మగవాడు బహుభార్యలతో ఉండవచ్చనే విషయం కూడా ఉందికదా! ఇవన్నీ జరక్కపోయినా కనీసం ఆ అమ్మాయిని తన మతంలోకి మార్పించేసి ఉంటాడు. తప్పదు మనుషులన్నాక ఎక్కడో ఒక దగ్గర సర్దుకుపోవాల్సిందే.

"అదిసరే బాషా! మరి నీ భార్య' అంటూ నాన్చాను."

"నాకు తెలుసు రాజా! నీ డౌటు... దానికేం అన్యాయం చేయలేదు" అని చెప్పేసి వెళ్ళిపోయాడతను.

ఇట్లా మతాంతర వివాహాలు చేసుకున్న హిందూ, ముస్లిం మిత్రులు కొందరున్నారు నాకు. రెండు మతాల సమాజాలనీ సమాధానపరిచేందుకు రెండురకాలయిన మతాల పెళ్ళిళ్లనూ చేసుకున్నట్టు నటించేసి, చివర్లో మగవారి సొంతమతాల్లోకి వాళ్ళ భార్యల్ని మార్చేసుకోవడం చూశాను. మరొక క్రైస్తవ మిత్రుడయితే బహుభార్యత్వంకోసమే ముస్లిమ్‌గా మారాడు. మనిషి తనకనుకూలంగా మతాన్ని మార్చుకుంటున్నాడా? అనిపిస్తుంది.

మూడు నెలల తర్వాత బాషా వాళ్ళన్నయ్య ప్లాటుకి రైతువారీ పట్టా మంజూరయింది. దాన్ని తీసుకుపోయాడతను.

======

ఒకరోజు మధ్యాహ్నం గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసి రావడానికి హెచ్‌పి గ్యాస్ కార్యాలయానికి పోవాల్సివచ్చింది. పని అయ్యాక తిరిగి వస్తుంటే "రాజా!" అన్న పిలుపుతో తిరిగి చూశాను. ఖాకీ డ్రెస్‌లో బాషా! ఎవరో 50 ఏళ్ళ వయసున్న మనిషి అతనిపక్కన ఉన్నాడు. స్కూటర్ ఆపి, స్టాండ్ వేసి అతనికి దగ్గరగా పోయాను.

"అదేందీ నువ్విక్కడ? ఖాకీ డ్రెస్సులో" అన్నాను.

"హైదరాబాదునుంచీ మాకొక పైఆఫీసరు

వచ్చినాడులే - ఈ గెస్టుహౌస్‌లో దిగినాడు. నాకు ఇక్కడ డ్యూటీ వేసినారు".

తలెత్తి చూశాను గెస్టుహౌస్ వైపు 'పొదుపు భవనం' అన్న పెద్దపెద్ద లోహపు అక్షరాలు మెరుస్తూ కనిపించాయి. ఈ గెస్టు హౌస్‌ని ప్రభుత్వ అధికారులకు మాత్రమే కేటాయిస్తుంటారు కలెక్టరాఫీసువాళ్ళు.

"అప్పుడే మనం కలవక రెండేళ్ళయి ఉంటుంది కదా బాషా! మీ అన్నయ్య ఎట్లున్నాడు!" అడిగాను.

"బాగున్నాడు రాజా! నీ పుణ్యమాఅని రైతువారీ పట్టారావడంతో ఆ ప్లాటుని అమ్మేసుకొని, ఇద్దరికూతుర్లకుపెండ్లి చేసేసినాడు".

"అవునా.. సంతోషం"

తనపక్కనున్న మనిషిని చూపిస్తూ "ఇతని పేరు సాల్మన్. సాయినగర్‌లో క్రిస్టియన్ మేరేజ్ బ్యూరో ఉంది" అంటూ నాకు అతన్ని పరిచయం చేస్తూనే, నన్నుకూడా తన క్లాస్‌మేటుగా పరిచయం చేశాడు. సాల్మన్‌తో కరచాలనం చేశాను. కాసేపటికి సాల్మన్ తనకేదో పని ఉన్నదంటూ వెళ్లిపోయాడు.

అతను వెళ్ళిన దిక్కే చూస్తూ- "మా పాపకు ఎక్కడన్నా మంచి సంబంధముంటే చెప్పమ్మా! బీఎస్సీ బీఈడీ చేసింది మొన్ననే డిఎస్సీ కూడా రాసింది. జాబ్ వచ్చే అవకాశం వుంది" అన్నాడు బాషా.

"అట్లనా, నువ్వు భలేవాడివి బాషా! చెప్పి చెప్పి నాకు చెప్తా ఉన్నావు, సంబంధాలు చూడమని. నువ్వు తప్పా నాకు ముస్లిం ఫ్రెండ్స్ ఎవరున్నారు. అంతా హలో అంటే హలో అనేవాళ్ళే. ఏ ముస్లిం సోదరుడికో చెబితే మంచి సంబంధం చూస్తాడప్పా!" అన్నాను. అసలే సనాతన పరుడయిన బాషా కూతురికి నా వంటివాడేం సంబంధాలు చూడగలడు.

"నేను చూడమన్నది ముస్లిం సంబంధాలు కాదు రాజా! క్రిస్టియన్ సంబంధాల్నే... ఇందాకా సాల్మన్‌తో కూడా అదే చెప్పాను. మీ కలెక్టరాఫీసులో ఎవరయినా క్రిస్టియన్ అబ్బాయిలుంటారు కదా... అందుకని చెప్తున్నా" అన్నాడు.

అదిరిపోయాను.

"బాషా! ఏంది నువ్వు మాట్లాడేది? నాకంతా గందరగోళంగా ఉందప్పా! నువ్వు సనాతన ముస్లింవి కదా"! అంటూ ఆపేశాను.

"నేను ముస్లింనే రాజా! కానీ నా భార్య మాత్రం క్రిస్టియనే. ఆమె మా మతంలోకి మారలేదు."

"అదెట్లా!" ఇంకా తికమకలో పడిపోతూ అడిగాను.

"అవును. తను సనాతన క్రైస్తవాచారాల మధ్య పెరిగిన పిల్ల. నాకు ఆమెను బలవంతాన మా మతంలో మార్చాలని అనిపించలేదప్పా! అందుకే దాని మతానికి నేను అడ్డుపడలే! తనుకూడా మా మతాచారాలకీ అడ్డుకాలేదు. మా పాపకి కూడా తల్లిమాదిరే క్రిస్టియన్‌గానే ఉండడం ఇష్టం. ఇదీ మా ఇంటి పరిస్థితి. ఇప్పుడు ఆ పాపకి పెళ్లీడు వచ్చింది. అందుకే క్రిస్టియన్ సంబంధాలు ఉంటే చూడమని అంటూ ఉండేది" అంటూ నావైపు నవ్వుతూ చూశాడు.

"ఆమెను అట్లా క్రిస్టియన్‌గానే ఉండనిచ్చినావు, అంటే నువ్వు మతపరంగా మరో అమ్మాయిని పెండ్లిచేసుకున్నావేమో కదా"! చాలా మామూలు విషయమన్నట్లు అనేశాను.

"అయ్యయ్యో! నువ్వు భలేవానివి కదప్పా- రాజా! నేను చేసుకోనిందే ఒకే ఒక పెండ్లి- అదీ క్రిస్టియన్ పెండ్లి! నీకు తెలుసో లేదో ఆమెకి పక్షవాతం వచ్చి సంవత్సరం నించి కుడికాలూ, కుడిచేయీ పడిపోయాయి. మాటలు కూడా సరిగ్గా మాట్లాడలేదు. ఆమెకు చాకిరీ చేసేదంతా నేనే తెలుసా!" అంటూ చెబుతోంటే- ఏం మాట్లాడలేక పోయినాను. అతని చేతిని నా రెండుచేతుల్లోకి తీసుకొని మృదువుగా నొక్కాను.

# రాళ్ళకి వేర్లుండవు

**ఈతకోట సుబ్బారావు**

సుక దొందులా మెత్తగా అమ్లమరీచిక
వూపిరై గుండెల్లోకి జారుకొంటుంది
రంగుమారుతున్న ఆకాశం
స్లోపాయిజన్ని వాతావరణంలో యింజెక్ట్ చేస్తుంది
నరికేస్తున్న అడవుల్లో అనాథలైన
చావుకేకల శిథిల రాగాలు
ఉష్ణ సర్పాల్ని రెచ్చగొడతాయి
రసాయన ప్రవాహాల శవయాత్ర
ప్రాణవునికిని కబలించే మృత్యుమృగంలా
నిశ్శబ్దలయను ఆవిష్కరిస్తుంది.
ఎడారులైన పచ్చని పొలాలన్నీ
జీవశ్వాసలా శ్మశానంగా మారిపోతూ
చరిత్ర గమనానికి ప్రత్యక్షసాక్షి
మొదల్నుంచి నరికేసిన మహావృక్షం
నాగరికత చెదకు బలైపోయిన వీరనారి
జ్వాలాముఖి పునాదులపై మొలిచిన ప్రగతి
చర్మం కమిలే వాయుసమూహాల మహాసముద్రం
అమ్మ గర్భసంచిలో ఈదే పిండాన్ని సైతం
కాలుష్యకోర కసిగా కాటేస్తున్న నిజం
రేపటి తరానికి ఆరోగ్యం లంకెబిందెల కథే!
చిరునవ్వుల తోట వుండదు
ఆనందాల పాట వుండదు
కొండలు, బండలు, రాళ్లు తప్ప
పచ్చగా మొలవలేని రాళ్ళకి వేర్లుండవు!